క్లుప్తంగా

నామినేషన్ కేంద్రాలు పరిశీలించిన కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

శంకరపట్నం: మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ కేంద్రాలను గురువారం కలెక్టర్ పమేలాసత్పతి పరిశీలించారు. అభ్యర్థుల కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించి ఎంపీడీవో కృష్ణప్రసాద్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ కేంద్రాల్లో రిటర్నింగ్ అధికారులతో మాట్లాడారు. నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సురేఖ, డిప్యూటీ తహసీల్దార్ పార్థసారథి ఉన్నారు.

వావిలాల పీహెచ్‌సీ తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్నవెంకటరమణ

జమ్మికుంట: మండలంలోని వావిలాల పీహెచ్‌సీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. వెంకటరమణ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా. చందు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్, ఫార్మసీ, లేబర్ రూమ్‌లు, రికార్డులను పరిశీలించారు. ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని మంగళ, శుక్రవారం నిర్వహించాలని, తప్పనిసరిగా మహిళలకు అన్నిరకాల వైద్య పరీక్షలు చేయాలని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డా. వరణ, ఫార్మసిస్ట్ రాజా, శ్రీధర్‌రావు, నర్సింగ్ ఆఫీసర్ సాయికుమార్, ల్యాబ్ టెక్నీషియన్ రామకృష్ణ పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ


కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

జమ్మికుంట: హుజూరాబాద్‌లో ఆ నెల 12న నిర్వహించే సీఐటీయూ జిల్లా ఐదో మహాసభ కరపత్రాన్ని గురువారం పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్ ఆవరణలో సీఐటీయూ జిల్లా కొప్పుల శంకర్ ఆధ్వర్యంలో నాయకులు ఆవిష్కరించారు. సీఐటీయూ నిరంతరం పోరాటంతో పంచాయతీ కార్మికుల హక్కులు సాధించామని, కార్మికుల ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, మల్టీపర్పస్ విధానం వంటి సమస్యలు పరిష్కారం కావాల్సి ఉందన్నారు. జిల్లా మహాసభలో కార్మికుల సమస్యలపై చర్చించి, భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, నాయకులు పెరుగు అశోక్, మ్యాకమల్ల రాము, తిరుపతి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైలారం అంగన్‌వాడీలో పోషణ్ అభియాన్


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత

గన్నేరువరం: మండలంలోని మైలారం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూపర్‌వైజర్ కవిత హాజరై మాట్లాడారు. పిల్లలకు ఇంటిలో చేసిన వంటకాలను ఆహారంగా అందించాలని, బయట లభించే ఆహార పదార్థాల్లో చక్కెర స్థాయి, నూనె అధికంగా ఉంటుందని, దీంతో అనారోగ్యం బారినపడతారని, బెల్లం, నువ్వులు, పల్లీలు, డ్రైఫ్రూట్స్ ఎక్కువగా తినిపించాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. అనంతరం పిల్లలకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష పార్టీలే అడ్డుకున్నాయి..

గన్నేరువరం: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకాకుండా ప్రతిపక్ష పార్టీలే అడ్డుకున్నాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బొడ్డు సునీల్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు.

నియామకం

కరీంనగర్: తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి జిల్లా అధ్యక్షుడిగా చింతల మల్లేశంను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లాపు దుర్గారావు ప్రకటన విడుదల చేశారు. మల్లేశం మాట్లాడుతూ.. బీసీ కులాల సంక్షేమం కోసం పాటుపడుతానని, నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇబ్బందులుపడుతున్నా ఇటు చూడరా..!


వల్భాపూర్‌లో చెరువు కట్ట వద్ద రోడ్డుపైకి నీరు


వాటర్ ప్లాంట్‌కు వెళ్లే దారిలో..

వీణవంక: మండలంలోని వల్భాపూర్ గ్రామంలో రోడ్లపైకి నీరు చేరుతుండటంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెరువు కట్ట వద్ద డ్రైయినేజీ లేక మురుగునీరు రోడ్డుపైకి వస్తుండటంతో గ్రామస్తులు జారి పడుతున్నారు. అదేవిధంగా వాటర్ ప్లాంట్‌కు వెళ్లే దారిలో నల్లా నీరు రోడ్డుపైకి వస్తుండటంతో బురదమయంగా మారుతోంది. అలాగే వాటర్ ప్లాంట్ నీరు రోడ్డుపైకి చేరుతుంది. ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో సీసీరోడ్డుపై నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బస్టాండ్ నుంచి చెరువు కట్ట వరకు ప్రధాన సీసీరోడ్డు గుంతలమయంగా తయారైంది. సీసీరోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ ధ్వంసం కావడంతో నీరు నిల్వ ఉంటుంది, పిచ్చిమొక్కలు పెరిగి దోమలకు ఆవాసంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నో ‘డిజిటల్ లెర్నింగ్’

- ఏడాదిగా కొనసాగని తరగతులు
- వేగవంతమైన నెట్‌వర్క్ సౌకర్యం కల్పిస్తేనే మేలు
- ఒక పాఠశాలకు ఒకే ప్యానెల్ బోర్డు
- తరగతి గదికో ప్యానెల్ బోర్డు ఇవ్వాలంటున్న టీచర్లు


బొమ్మనపల్లి ఉన్నత పాఠశాలలో మ్యాథ్స్ సబ్జెక్టు బోధిస్తున్న టీచర్ (ఫైల్)

చిగురుమామిడి: మండలంలోని ప్రభుత్వ పాఠశాల ల్లో డిజిటల్ విద్యాబోధన కానరావడం లేదు. ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేసి ప్రతి పాఠశాలకు ఒక ప్యానలెబోర్డు, టీవీతో పాటు ఇతర సామగ్రి సరఫరా చేసింది. కానీ ఏడాదిగా వైఫై కనెక్షన్ సరిగా రాక డిజిటల్ విద్యాబోధన కుంటుపడింది. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. డిజిటల్ తరగతులకు అన్ని సౌకర్యాలు కల్పించిన ప్రభుత్వం నామమాత్రపు వైఫై కనెక్షన్ ఇవ్వడంతో పనిచేయని పరిస్థితి నెలకొందని టీచర్లు అంటున్నారు.

ఎప్పుడూ సర్వర్ బిజీ

గత ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆన్‌లైన్ విద్య కోసం డిజిటల్ సౌకర్యం కల్పించింది. మండలంలోని రేకొండ, బొమ్మనపల్లి, చిగురుమామిడి, సుందరగిరి, నవాబుపేట్, ఇందుర్తి, ముదిమాణిక్యం, చిన్నముల్కనూర్, రామంచతో పాటు మరో రెండు జెడ్పీ పాఠశాలల్లో డిజిటల్ బోధన కోసం మెటీరియల్ సరఫరా చేసింది. వీటితో పాటు కొండాపూర్, గాగిరెడ్డిపల్లి, ఉల్లంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలు సామగ్రి అందజేసింది. చిన్నముల్కనూర్‌ని ఆదర్శ పాఠశాలకు రూ.పది లక్షలు మంజూరు చేసింది. ఈ పాఠశాలలో నాలుగు ప్యానెల్ బోర్డులు, మిగతా పాఠశాలలకు మాత్రం ఒకే ప్యానెల్ బోర్డు సరఫరా చేసింది. వీటన్నీటికి వైఫై కనెక్షన్‌ను కూడా ఇచ్చింది కానీ కనెక్షన్‌కు అతి తక్కువ ఎంబీ సామర్థ్యం ఉన్న నెట్‌కనెక్షన్ ఇవ్వడంతో సర్వర్ బిజీ అని వస్తుందని ఆయా సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులు తెలిపారు. ఆరు నుంచి పదో తరగతి చదివే విద్యార్థులకు సైన్స్, సోషల్, ఇంగ్లిష్, తెలుగు, మ్యాథ్స్ సబ్జెక్టులు బోధిస్తుంటారు. సరైన నెట్ సౌకర్యం లేక డిజిటల్ తరగతులు కొనసాగడంలేదు. ప్రస్తుతం ఇస్తున్న 10–20 ఎంబీపీఎస్ స్పీడ్ సరిపోవడం లేదు. దీన్ని వంద ఎంబీపీఎస్ (మెగా బైట్స్ పర్ సెకండ్స్)కు పెంచితే డిజిటల్ విద్యాబోధన విద్యార్థులకు సౌకర్యవంతంగా మారే అవకాశం ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్యానెల్ బోర్డులు సరిపోవడంలేదని, ప్రతీ తరగతి ప్యానెల్ బోర్డు ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని, ఒకే ఒక ప్యానెల్ బోర్డుతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.

జాడలేని తనిఖీ

పాఠశాలలను నెలకోసారైన విద్యాశాఖ ఉన్నతాధికారులు తనిఖీ చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. రూ.లక్షలు వెచ్చించి పాఠశాలలకు డిజిటల్ విద్యాబోధన కోసం మెటీరియల్ సరఫరా చేస్తే అవి పనిచేస్తున్నాయా లేదా అనేది తెలుస్తుందని, ఇప్పటివరకు జిల్లాస్థాయిలో డీఈవో మాత్రమే తనిఖీ చేస్తున్నారు. అలా కాకుండా ఉన్నతస్థాయి అధికారులు తనిఖీ చేయాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులకు విన్నవించాం



మండలంలోని ఆయా పాఠశాలల్లో సాంకేతిక కారణాల వల్ల డిజిటల్ విద్యాబోధన కొనసాగడంలేదు. కొన్నిచోట్ల బ్యాటరీలు పనిచేయడంలేదు, మరికొన్ని చోట్ల ఇంటర్‌నెట్ రావడంలేదు, ఇంకొన్ని పాఠశాలల్లో అప్‌లోడ్ చేయడం కూడా ఆలస్యమవుతోంది. సమస్యలను జిల్లా విద్యాశాఖాధికారికి విన్నవించాం. సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు స్కూళ్లను సందర్శిస్తున్నారు.

– పావని, ఎంఈవో చిగురుమామిడి

ఎన్నికల్లో గెలవడానికి హామీలు

- రెండేళ్లు కావస్తున్నా కాంగ్రెస్ పార్టీ హామీలు నెరవేర్చలేదు
- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్


బాకీ కార్డు ప్రదర్శిస్తున్న రసమయి బాలకిషన్


మానకొండూర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన 420 హామీలు నెరవేర్చక ప్రజలకు బాకీ పడిందని, బాకీని కార్డుల రూపంలో ఇంటింటా ప్రచారం చేయాలని బీఆర్‌ఎస్ కార్యకర్తలను మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కోరారు. గురువారం మానకొండూరులో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల్లో గెలవడానికి అనేక హామీలు ఇచ్చిందని, అధికారం చేపట్టి రెండేళ్లు కావస్తున్న హామీలు నెరవేర్చలేదని మండిపడ్డారు. పింఛన్ల పెంపు, రైతుభరోసా, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇలా అనేక పథకాల పేరిట ప్రజలను మోసం చేసిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలని, ఆరు నియోజకవర్గంలో గెలుపొందాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ బీసీ రిజర్వేషన్ల పేరిట మోసం చేస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జెడ్పీటీసీలు సిద్ధం వేణు, తాళ్లపల్లి శేఖర్ గౌడ్, శ్రీనివాసరెడ్డి నాయకులు రామంచ గోపాల్ రెడ్డి, ఎరుకల శ్రీనివాస్ గౌడ్, శాతరాజు యాదగిరి, మధు, వెంకటస్వామి, ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న రైతులు

జమ్మికుంట: మండలంలోని మడిపల్లి, హుజూరాబాద్ మండలం చెల్పూర్ గ్రామాల మధ్య రైల్వే లైన్ 18 గేటు వద్ద బ్రిడ్జి నిర్మాణం కోసం రైల్వే అధికారులు సర్వే చేశారని, ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం ప్లానింగ్‌ను తప్పుడు సమాచారంతో ఇద్దరు వ్యక్తులు ఉద్దేశ పూర్వకంగా అడ్డుకునే విషయంపై మడిపల్లి గ్రామ రైతులు సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ నల్ల వెంకట్‌రెడ్డికి గురువారం అందజేశారు. మడిపల్లి, చెల్పూర్ గ్రామాల రైతులు, ప్రజలు, వాహనాదారులకు సౌకర్యం కోసం మాజీ మంత్రి, ప్రస్తుత మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ రూ.ఐదు కోట్లతో బీటీ రోడ్డు, చెల్పూర్ వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేశారు. రైల్వే గేటు ద్వారా ఇల్లందకుంట మండలం శ్రీరాములపల్లి, లక్ష్మాజిపల్లి, కనగర్తి, జమ్మికుంట మండలం మడిపల్లి, అంకుషాపూర్ గ్రామాల ప్రజలు, రైతులు హుజూరాబాద్, కరీంనగర్ పట్టణాలకు బీటీ రోడ్డు ద్వారా ప్రయాణం సాగిస్తుంటారు. దక్షిణమధ్య రైల్వే గేట్ ఎత్తివేసే క్రమంలో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి కోసం సర్వే చేసింది. కానీ ఇద్దరు వ్యక్తులు రైల్వే ప్లానింగ్ తప్పించి అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, వారితో అటువైపు వెళ్లే రైతులు, వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని, రైల్వే అధికారులు సర్వే చేసిన విధంగా ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని రెండు ప్రజలు, రైతులు వినతి పత్రంలో కోరారు.

గర్భిణులకు ఉచిత వైద్యసేవలు


బాలింతకు బేబీకిట్ అందిస్తున్న లక్ష్మీనర్సింహారావు

కరీంనగర్‌రూరల్: మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం జరిగే వరకు చల్మెడ ఆనందరావు ఆస్పత్రిలో ఉచిత వైద్యసేవలు అందించనున్నట్లు ఆస్పత్రి చైర్మన్ చల్మెడ లక్ష్మీనర్సింహారావు తెలిపారు. బొమ్మకల్‌లోని చల్మెడ ఆనందరావు ఆస్పత్రిలో గురువారం మాట్లాడుతూ.. ఆస్పత్రిలో పేరు నమోదు చేసుకున్న గర్భిణులకు ప్రతినెల వైద్యపరీక్షలు, స్కానింగ్ నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తామని తెలిపారు. ప్రసవం అనంతరం శిశువు ఆరోగ్య రక్షణకు చల్మెడ బేబీకిట్లు అందజేస్తామని అన్నారు. నెలరోజులపాటు శిశువుకు ఉచితంగా టీకాలు పంపిణీ చేస్తామని వివరించారు. బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన రోగులను నాలుగు గంటల్లోపు ఆస్పత్రిలో చేర్పించినట్లయితే తగిన వైద్యం అందించనున్నట్లు తెలిపారు. అనంతరం ఇటీవల ఆస్పత్రిలో ప్రసవించిన నలుగురికి చల్మెడ బేబీకిట్లు అందించారు. ఆస్పత్రి డైరెక్టర్ వి.సూర్యనారాయణరెడ్డి, ప్రిన్స్‌పాల్ ఆసీంఅలీ, సూపరింటెండెంట్ రామకృష్ణ ప్రసాద్, వైద్యులు రమాదేవి, మాధవి, కవిత, అర్జుమాండ్ బానో, ప్రశాంత్, శ్రావణ్ పాల్గొన్నారు.

సేవలు భేష్


కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న నన్నపనేని రాజీవ్

తిమ్మాపూర్: మానవ సేవే మాధవ సేవ, మాజీ ఎమ్మెల్యే, మానసిక వికలాంగుల ట్రస్ట్ చైర్మన్ చాడ వెంకటరెడ్డి నిబద్ధతతో అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని నాట్‌కో ఫార్మా లిమిటెడ్ సీఈవో, వైస్ చైర్మన్ నన్నపనేని రాజీవ్ కొనియాడారు. ఎల్‌ఎండీ కాలనీలోని మానసిక వికలాంగుల పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సెప్టెంబర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. అవసరమున్న వారికి మంజూరైన కళ్లద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. ‘మానసిక వికలాంగులకు సేవ చేయడం గొప్పవిషయమని చాడ వెంకటరెడ్డి ట్రస్ట్ చైర్మన్‌గా చేస్తున్న కృషి సామాజిక బాధ్యతకు ఆదర్శం’ అని, భవిష్యత్‌లో ఇలాంటి సేవా కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ సహకారం అవసరం..

మాజీ ఎమ్మెల్యే, ట్రస్ట్ చైర్మన్ చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. 2014 వరకు ప్రభుత్వం నుంచి గ్రాంట్ లభించేదని. ప్రస్తుతం గ్రాంట్ అందడం లేదని వెల్లడించారు. ఇటీవల మహిళా సంక్షేమ సంస్థ చైర్మన్ అనిత రామచంద్రను కలిసి పాఠశాల అవసరాలను వివరించగా, ప్రయాణ సౌకర్యం కోసం శ్రీనిధి ద్వారా రూ.26 లక్షల బస్సు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు జి. కొమురెల్లారెడ్డి, జి. భగవాన్, ప్రేమ్ చంద్, వంశీ, బాలరాజు, అడ్మినిస్ట్రేటర్, ప్రిన్సిపాల్ సతీష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఔరా... ఇది విచిత్రమే!



రామడుగు: సోరకాయ మొక్క పువ్వులు పూసి కాయలు కాయడం సహజం. కానీ మండలంలోని వెదిర గ్రామంలో హమీర్ అనే వ్యక్తి ఇంటి వద్ద సోరకాయ మొక్కకు ఊడలు ఏర్పడటంతో అందరు ఆశ్చర్యంగా చూస్తున్నారు. ప్రస్తుతం మొక్క సోరకాయలు కాయకుండా ఊడలు వేస్తుందని హమీర్ తెలిపారు.


అఖండ సంకీర్తన కార్యక్రమంలో చొప్పదండి భజన మండలి సభ్యులు

అఖండ హరినామ సంకీర్తన

చొప్పదండి: పట్టణానికి చెందిన హనుమాన్‌సాయి భజన మండలి సభ్యులు తిరుమల తిరుపతిలోని అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో పాల్గొన్నారు. టీటీడీ ఆహ్వానం మేరకు సంకీర్తన వేదికలో భజన బృందం సభ్యులు సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో పిట్టల రఘు, దండె లింగన్న, గాజుల రాజ్‌కుమార్, చీకట్ల లచ్చయ్య, దూస రాము, పూదరి లస్మయ్య, నారాయణ, విఠల్, చంద్రారెడ్డి, వెంకన్న లక్ష్మిరాజం, తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన


మల్లికార్జునస్వామిని దర్శించుకున్న సుప్రిత

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని శ్రీదుబ్బామల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవ పనులను జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రిత గురువారం పరిశీలించారు. ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఆలయ పూజారులు మేడిపల్లి వెంకన్న, ఓదెలు, శ్రీనివాస్‌వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఒగ్గు పూజారులు, భక్తులు పాల్గొన్నారు.



ధ్వంసమైన కల్వర్టుకు మరమ్మతు

శంకరపట్నం: మండలంలోని గద్దపాక– కాచాపూర్ గ్రామాల మధ్య పగుళ్లబారిన కల్వర్టుకు రైతులు, గ్రామస్తులు మరమ్మతు చేశారు. రెండు గ్రామాల మధ్య చెరువు మత్తడి నుంచి వచ్చే వరదనీటి ప్రవాహంతో రెండు నెలల క్రితం కల్వర్టుపై పగుళ్లు, గండి ఏర్పడ్డాయి. దీంతో నెలరోజులుగా ఆర్టీసీ బస్సు సర్వీసు నిలిచిపోయింది. ఆర్‌ఎంకు ఫిర్యాదు చేయగా బుధవారం కరీంనగర్ డీఎం విజయ మాధురి రూట్‌ను పరిశీలించారు. కల్వర్టు వద్ద మరమ్మతు చేస్తే బస్సును పునరిద్ధరిస్తామని చెప్పడంతో మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బస్వయ్య, మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, మాజీ సర్పంచ్ తిరుపతి, రైతులు, గ్రామస్తులు కల్వర్టుపై ఏర్పడిన పగుళ్లు, గుంతల్లో సిమెంట్, కంకర వేసి మరమ్మతు చేశారు.

సన్మానం



జమ్మికుంట: పట్టణంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని అపోపా మండలశాఖ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ఉత్తమ ఉపాధ్యాయులను గురువారం ఘనంగా సన్మానించారు. బోధనలో ఉత్తమ సేవలు అందించిన కూర విజేందర్‌రెడ్డి(విజ్ఞమ్ జూనియర్ కళాశాల), ప్రభుత్వ ఉపాధ్యాయులు బాదం సురేశ్‌బాబు, రావికంటి పవన్, అకినపల్లి శ్రీధర్, అల్లంకి శ్రీనివాస్, తాడిశెట్టి సురేష్, చిదురాల అర్చనను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అపోపా మండల అధ్యక్షుడు అకినపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మంచాల రాంబాబు, ప్రముఖ వైద్యుడు ముక్కా రాజేశ్వరయ్య, జిల్లా, జోనల్, మండల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా బ్లూకోల్ట్స్ సేవలు ప్రారంభం



చొప్పదండి: మహిళలకు రక్షణగా నారీ శక్తి బ్లూకోల్ట్స్ సేవలను ప్రారంభించామని, మహిళల పట్ల ఆకతాయిల ఆగడాలను అరికట్టేందుకు పనిచేస్తారని ఎస్ఐ నరేశ్ రెడ్డి తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో బ్లూకోల్ట్స్ సేవలను ప్రారంభించారు. సమస్య ఎదురైతే డయల్ 100 ఫోన్ చేసి సహాయం పొందాలని కోరారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభినందన



రామడుగు: మండలంలోని కోరటపల్లి గ్రామానికి చెందిన బందారపు ఆమని గ్రూప్–2లో ఎంపీవో ఉద్యోగం సాధించింది. గురువారం బ్రిలియంట్ స్కూల్ కరస్పాండెంట్ తోట కిరణ్‌కుమార్ అభినందించి శాలువా కప్పి సన్మానించారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

చొప్పదండి: మండలంలోని కాట్నపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు అంతికం నారాయణగౌడ్ (56) గురువారం ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడటంతో గాయపడ్డాడు. తోటి గీత కార్మికులు వెంటనే కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలు కావడంతో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లామని గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్టు

శంకరపట్నం: దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు హుజూరాబాద్ ఏసీపీ మాధవి తెలిపారు. కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌లో గురువారం నిందితుల వివరాలు వెల్లడించారు. మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ ఎండీ బాబా, చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన షేక్ అజీమ్ కలిసి మండలంలోని ముత్తారం, కరీంపేట, తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం, చిగురుమామిడి మండలం బొమ్మనపల్లి, రేగొండలో ఆలయాలు, ఇళ్లతాలాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడ్డారు. పొలాల వద్ద విద్యుత్ మోటర్లు ఎత్తుకెళ్లారు. నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.80వేల నగదు, బంగారం, వెండి, ఆటో స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన ఎస్సై శేఖర్‌రెడ్డి, కానిస్టేబుల్ సల్మాన్‌ను ఏసీపీ అభినందించారు.

ఆలయంలో చోరీ

తిమ్మాపూర్: మండలంలోని పోరండ్ల గ్రామంలో పెద్దమ్మతల్లి ఆలయంలో గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. బుధవారం అర్ధరాత్రి ఆలయంలోకి చొరబడి హుండీని ధ్వంసం చేసి నగదు ఎత్తుకెళ్లారు. గమనించిన ముదిరాజ్ కులస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఎల్‌ఎండీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోతుల దాడిలో రైతుకు..

శంకరపట్నం: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన రైతు వెంకట్‌రెడ్డిపై కోతుల గుంపు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయని గ్రామస్తులు తెలిపారు. వెంకట్‌రెడ్డిని వెంటనే హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించామన్నారు.